క్లుప్తంగా

అక్రమ నిర్మాణాల కూల్చివేత



గండికోటలో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

జమ్మలమడుగు : పర్యాటక కేంద్రమైన గండికోటలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మించిన నిర్మాణాలను రెవెన్యూ, పోలీసు అధికారులు తొలగించారు. శనివారం ఉదయం ఆర్డీఓ జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో తహసీల్దార్ గురప్ప, సీఐ కరుణాకర్‌లు రోడ్డుకు పక్కన ఉన్న వాటర్ ప్లాంట్‌ను, మరో రెండు భవనాలను కూల్చివేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ పర్యాటక కేంద్రమైన గండికోటలో ప్రభుత్వ స్థలాన్ని ఎవరు అక్రమించినా వాటిని తొలగించడంతోపాటు వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గండికోట ప్రాంతంలో దాదాపు 1200 ఎకరాల భూమిని పర్యాటక శాఖకు కేటాయించడం జరిగింది. అ ప్రాంతంలో త్వరలో రూ.700 కోట్లతో గండికోట ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం కోసం ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో హోటల్స్ నిర్మించడం జరిగింది. వాటికి ఎటువంటి అనుమతులు లేవన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే మానసిక వైద్యనిపుణులు డాక్టర్ హరిత తలనొప్పి, నిద్రలేమి, ఆందోళన, దడ, భయం, వింత ఆలోచనలు, అనవసరం ఆలోచనలు, తదితర వాటికి వైద్య చికిత్సలు అందించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు డాక్టర్లు అందుబాటులోఉంటారని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేడు భానుకోటలో లక్ష బిల్వార్చన

సింహాద్రిపురం : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన భానుకోట సోమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం లక్ష బిల్వార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు బద్రిశర్మ, సురేష్‌శర్మలు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు



గుండం చుట్టూ జ్యోతులతో నృత్యం చేస్తున్న భక్తులు

జమ్మలమడుగు : మండలంలోని మోరగుడి గ్రామంలో చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. తొగటవీర క్షత్రియులు అమ్మవారి పేరుతో జ్యోతులను తయారు చేసి వాటిని నెత్తిపై పెట్టుకుని అమ్మవారు కీర్తనలు పాడుతూ నృత్యాలను చేస్తూ పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లారు. భక్తులు జ్యోతుల ముందు బిందెలతో నీటిని చల్లి అమ్మవారికి పూజలను నిర్వహించారు. అనంతరం చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో దిగి జ్యోతులను ఆర్పే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.

క్రీడలపై యువత మక్కువ పెంచుకోవాలి



సర్పంచులకు క్రీడా కిట్లు అందిస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కమలాపురం : రాష్ట్రంలోని యువకులందరూ క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని స్టేట్ హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సర్పంచులకు ఎంపీడీఓ జ్యోతి ప్రభుత్వం సరఫరా చేసిన క్రీడా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతను ప్రోత్సహించేందుకు ఆడుదాం.. ఆంధ్ర పేరిట గ్రామ, సచివాలయ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఐదు రకాల పోటీలను నిర్వహించడం హర్షణీయం అన్నారు. 15 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ క్రీడా పోటీల్లో పాల్గొనడానికి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు రాజుపాళెం సుబ్బారెడ్డి, సర్పంచులు రామసుబ్బారెడ్డి, బుజ్జన్న, జయ సుబ్బారెడ్డి, శ్రీనువాసులరెడ్డి, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవాలు



పులివెందుల : గ్రామోత్సవంలో అయ్యప్పస్వామి



పెద్దసంఖ్యలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు



లడ్డూను దక్కించుకున్న సర్పంచ్ మహేశ్వరరెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీమిట్టమల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రీ అయ్యప్పస్వామి 38వ మండల పూజ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ప్రాంతఃకాలంలో యాగశాల ప్రవేశం ఆచరించి గణపతి పూజ, హోమాలను జరిపించి, అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహానికి పంచామృత అభిషేకం నిర్వహించారు. పడిమెట్ల పాట పాడి భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. వేల సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. చింతకుంట వెంకటమహేశ్వరరెడ్డి దంపతులు అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించగా లయోలా, శ్రీచైతన్య కళాశాలల విద్యార్థులు పూర్తి సహాయ సహకారాలు అందజేసి భక్తుల రద్దీని అదుపు చేశారు. అయ్యప్ప స్వామి వద్ద ఉంచిన లడ్డును వేలం పాట నిర్వహించగా తుమ్మలపల్లె గ్రామానికి చెందిన సర్పంచ్ మహేశ్వరరెడ్డి రూ.1.26 లక్షలకు దక్కించుకున్నారు. వీరికి ఆలయ నిర్వాహకులు, గురుస్వాములు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. సాయంత్రం అయ్యప్పస్వామి గ్రామోత్స వం ఘనంగా నిర్వహించారు. స్వామివారి వెంట కన్య స్వాములు ఉపవాస దీక్షతో కలశాలు చేతబట్టి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. భజనలు, కోలాటం, మంగళ వాయిద్యాలు, కేరళ వాయిద్యాలు అలాగే విచిత్ర వేషధారణలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. పట్టణంలోని గుంతబజార్, అమ్మవారిశాలవీధి, మెయిన్‌బజార్, పూలంగళ్ల సర్కిల్, ముత్యాలవారివీధిల మీదుగా అయ్యప్పస్వామి ఊరేగింపుగా వచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చో టు చేసుకో కుండా ఎస్ఐ హుస్సేన్, ఏఎస్ఐ స్వామి పర్యవేక్షించారు.

కమలాపురంలో..

కమలాపురం : పట్టణంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవం శోభాయమానంగా నిర్వహించారు. శనివారం అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో అలంకరించి ఆలయం నుంచి పుర వీధుల గుండా అత్యం వైభవంగా నిర్వహించారు. ఆలయ గురుస్వామి డాక్టర్ నరసింహశర్మ ఆధ్వర్యంలో శబరిమలై ఆచార, వ్యవహార తాంత్రిక పద్ధతిలో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. గ్రామోత్సవంలో కన్నెసాములు కళశాలతో పాల్గొన్నారు. అయ్యప్ప భక్తులు అయ్యప్ప గీతాలు ఆలపిస్తూ నృత్యాలు చేశారు. ఉదయం ఆలయంలో గణపతి పూజ, గణపతి హోమం, ప్రధాన కలశ స్థాపన, ఉత్సవ విగ్రహానికి విశేష అభిషేకాలు, విశేష పూజలు చేశారు. సమీప ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిట కిట లాడింది. నిర్వాహకులు భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు.



కమలాపురం : గ్రామోత్సవంలో దీపాలతో కన్నె స్వాములు, మహిళా భక్తులు



ఎర్రగుంట్లలో లక్షార్చన పూజలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామంలో వెలసిన శ్రీ చెన్నకేశవస్వామి ఆలయ సన్నిదిలో ఉన్న అయ్యప్పలు గురుస్వామి నాగమల్లారెడ్డి ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో కేరళ వాయిద్యం, కోలాటం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలోని కడప రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి దేవస్థానంలో శనివారం నిర్వహించిన లక్షార్చన కార్యక్రమం వైభవంగా జరిగింది. స్వామికి అభిషేకాలు పూజలు నిర్వహించారు. తర్వాత అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులు లక్షార్చన పూజలో పాల్గొన్నారు. వేలాది మంది భక్తులకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

యునాని వైద్యంతో సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు

కమలాపురం : అతి పురాతనమైన యునాని వైద్యంతో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని అలాగే ఈ వైద్యంలో అన్ని రకాల రోగాలకు చికిత్సలు ఉన్నాయని ఒంటిమిట్ట యునాని వైద్యాధికారిణి నసీమున్నిసా తెలిపారు. శనివారం పట్టణంలోని బీడీ కాలనీలో ప్రభుత్వ ఖాజీ సయ్యద్ జాహిద్ హుసేన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి వచ్చిన దాదాపు 150 మంది రోగులను ఆమె పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యునాని వైద్యం చాలా పురాతనమైనదని, అన్ని దీర్ఘకాలిక రోగాలకు సైతం ఈ వైద్యంలో మందులు ఉన్నాయని, ప్రజలు ఈ మందులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయుష్ కమిషనర్, ఆర్‌డీడీ ఆదేశాల మేరకు కమలాపురంలో ఇప్పటికి నాలుగు శిబిరాలు నిర్వహించామన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



పొట్లదుర్తిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

ఎర్రగుంట్ల : మండల పరిధి పోట్లదుర్తి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను శనివారం ఆర్డీఓ శ్రీనివాసుల ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. చనిపోయిన వారి ఓట్లు పరిశీలించి తొలగించాలన్నారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా చూసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. పోట్లదుర్తిలోని 242, 243, 245, 246, 247, 248 పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. డిప్యూటీ తాహసీల్దార్ రమణారెడ్డి పాల్గొన్నారు.

అన్ని సదుపాయాలతో వ్యవసాయ కళాశాల



మాట్లాడుతున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల : వ్యవసాయ కళాశాలకు అవసరమైన అన్ని సదుపాయాలు ప్రభుత్వ సహకారంతో కల్పించామని ఇంకా కళాశాలకు కావాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని ఏపీ కార్ల్‌లో ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించిన వ్యవసాయ కళాశాలను ఏపీ కార్ల్ సీఈఓ రమణారెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ విద్యా సంవత్సరం నుంచి ఏపీ కార్ల్ ప్రాంగణంలో 60 మంది విద్యార్థులతో బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సును ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కళాశాలలో చక్కటి తరగతి గదులు, సౌకర్యవంతమైన ల్యాబ్‌లు తక్కువ సమయంలోనే అందుబాటులోకి తీసుకరావడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పులివెందుల వ్యవసాయ కళాశాలకు మంచి పేరు తీసుకరావాలన్నారు. అనంతరం పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఏపీ కార్ల్ సీఈఓ రమణారెడ్డిలను వ్యవసాయ కళాశాల సిబ్బంది, విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్‌జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ సుధాకర్, జాయింట్ రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాసులు, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీఎస్ నాయుడు, ఫుడ్ సైన్స్ అఫ్ టెక్నాలజీ అసోసియేట్ డీన్ డాక్టర్ సర్దార్ బేగ్, ప్రొఫెసర్ డాక్టర్ హరిప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం, ఎంపీలకు ధన్యవాదాలు

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీలో ని మార్కెట్ యార్డు వద్ద ఉన్న ఆంజనేయస్వామి గుడి అభివృద్ధి కోసం, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయడంతోపాటు గుడి కాంపౌండ్ కోసం మార్కెట్ యార్డుకు సంబంధించి కొంత ఖాళీ స్థలాన్ని కేటాయించడం పట్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలకు ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ పూజారిలు ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డు ఆంజనేయస్వామి గుడి వద్ద ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ పూజారిలు మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసా ద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హోలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్ పార్నపల్లె కిశోర్, కో ఆప్షన్ చంద్రమౌళిలను ఘనంగా సత్కరించారు.

అనాథలకు దుప్పట్ల పంపిణీ

ముద్దనూరు : వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ముద్దనూరులోని 4 రోడ్ల కూడలి, రైల్వేస్టేషన్‌లో చలికి ఇబ్బంది పడుతున్న అనాథలకు దుప్పట్లను పంపిణీ చేసినట్లు సంస్థ వ్యవస్థాపకుడు పి.రామకృష్ణారెడ్డి తెలిపారు. సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులు పంటలను సంరక్షించుకోవాలి

జమ్మలమడుగు రూరల్ : మిచాంగ్ తుఫాను ప్రభావం వల్ల జిల్లాలో భారీ వర్షాలు పడే వకాశం ఉందని రైతులు తాము పండించిన పంటలను సంరక్షించుకోవాలని ఆర్డీఓ జి. శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆర్డీఓ ఛాంబర్‌లో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. తుఫాను వల్ల రానున్న 3 రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు జిల్లాలో పడే అవకాశం ఉందని రైతులు తాము పండించిన పంటలను పొలాల్లో, రోడ్లపై ఆరవేసుకోవద్దన్నారు. వెంటనే రైతులు ధాన్యాన్ని గోడౌన్లలో భద్రపరచుకోవాలన్నారు. అలాగే మట్టి మిద్దెలలో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాల వల్ల పాత మిద్దెలు కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. అలాంటి ఇళ్లు ఉన్నవారు అధికారులకు సమాచారం ఇస్తే వారిని పాఠశాలల్లో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ 3 రోజుల పాటు మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలు, ఆర్డీఓ కార్యాలయంలో అధికారులు 24 గంటలు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్ 9502836762 కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

టీడీపీవి అసత్య ప్రచారాలు



విలేకరుల సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వీరపునాయునిపల్లె : తెలుగుదేశం పార్టీ నాయకులు తమ ఉనికిని కాపాడుకునేందుకు వైఎస్సార్‌సీపీ నుంచి 80 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారని అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఉరుటూరు గ్రామానికి చెందిన నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ప్రజలు ఆకర్షితులై ఆయనకు మద్దతుగా నిలుస్తుండటం చూసి ఓర్వలేని తెలుగుదేశం పార్టీ నాయకులు అసత్యపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. వారు చేస్తున్న ప్రచారాలను నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్న విషయాన్ని టీడీపీ నాయకులు గమనించాలన్నారు. కమలాపురం టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి బలవంతంగా వారి పార్టీ కండువా వారిపై వేసి మా పార్టీలోకి చేరారని ప్రచారం చేసుకోవడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. గత నెలలో మద్రిపల్లె గ్రామంలో ఒక కుటుంబం పార్టీ లోకి చేరితే 20 కుంటుంబాలు చేరాయని పత్రికల్లో రాయించుకున్నారన్నారు. బుసిరెడ్డిపల్లెలో 4 కుటుంబాలు, ఉరుటూరులో 1 కుటుంబం పార్టీలో చేరాయన్నారు. ఇప్పటికైనా బలవంతంగా పార్టీ కండువాలు వేయడంలాంటి పనులు మానుకుని ప్రజలకు మంచి చేసి వారి హృదయాల్లో స్థానం సంపాదించుకునేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు. అలాగే ఉరుటూరుకు చెందిన పెద్దరోసిగారి తిమ్మరాజు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వెంటనే ఉన్నామన్నారు. టీడీపీ వారు మాయింటికి వచ్చి బలవంతంగా వారి కండువావేసి టీడీపీలో చేరామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మేము ఎప్పటికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటామన్నారు.

బాధితురాలికి హెల్త్ పింఛన్ పంపిణీ



మునిశ్వేతకు పింఛన్ అందిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల : పట్టణంలోని బయమ్మతోట సచివాలయ పరిధిలోని కచేరి రోడ్డులో నివాసముంటున్న తుపాకుల మునిశ్వేత బోధకాలవల్ల బాధపడుతున్నా తనకు పింఛన్ రాలేదని ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హోలు గంగాధరరెడ్డిలకు విన్నవించారు. సమస్యను విన్నవించుకున్న నెలరోజుల్లోనే తుపాకుల మునిశ్వేతకు హెల్త్ పింఛన్ కింద రూ.5 వేలను శనివారం అందజేశారు. మునిశ్వేత మాట్లాడుతూ నాకు ఈ పింఛన్ రావడానికి కృషి చేసిన పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, పాడా ఆఫీస్ అకౌంట్స్ ఆఫీసర్ నీలకంఠారెడ్డి, ప్రతి ఒక్కరికి పేరు పేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బయమ్మతోట సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ బాల వెంకటేష్, వలంటీర్ గంగాద్రి నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు

పులివెందుల టౌన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించారని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక 4వ వార్డులోని ఉలిమెల్ల రోడ్డులోని ఏసురత్నం ఆఫీసు నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమై సియోన్ పురం సచివాలయ పరిధిలోని అహోబిలాపురం, గాయత్రి కాలనీ, స్పోర్ట్స్ కాంప్లెక్స్ తదితర ప్రాంతాలలో ముగిసింది. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రభుత్వ పథకాల బుక్‌లెట్లను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హోలు గంగాధరరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లె కిశోర్, చంద్రమౌళి, కో ఆప్షన్ చంద్రమౌళి వైఎస్సార్‌సీపీ నాయకులు కడియాల లక్ష్మీనారాయణ, ఫైర్‌స్టేషన్ రామకృష్ణ, రవి, సంపత్, కిరణ్, శ్రీరాములు, డేనియల్ బాబు, అంకాలమ్మ ఆలయ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ మల్లేల ఝాన్సీరాణి

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ మల్లేల ఝాన్సీరాణి తెలిపారు. శనివారం దాల్మియా, భారత్ ఫౌండేషన్ ఆధ్వరంలో నవాబుపేట, చిన్న కొమెర్ల, తలమంచిపట్నం గ్రామాలకు చెందిన 108 మంది లబ్ధిదారులకు ఆమె ఒక కోటి 8 లక్షల రూపాయల రుణాలను పంపిణీ చేసి మాట్లాడారు. దాల్మియా, భారత్ ఫౌండేషన్ వారు చేస్తున్న గ్రామాభివృద్ధి కార్యక్రమాలకు డీసీసీ బ్యాంక్ సహకారం ఎప్పటికీ ఉంటుందని ఆమె తెలిపారు. దాల్మియా ప్లాంట్ చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం దాల్మియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుగ్గనపల్లె వద్ద శానిటరీ ప్యాడ్ తయారీ యూనిట్‌ను ఆమె ప్రారంభించారు. నాబార్డ్ సహకారంతో పొదుపు సంఘాల ద్వారా నడుపబడే ఈ యూనిట్ జిల్లాలోనే మొదటిది అని ఆమె కోనియాడారు. కార్యక్రమంలో దాల్మియా యూనిట్ మేనేజర్ ముఖేష్ సిన్హా, డీసీసీ బ్యాంక్ సీఈఓ రాజేంద్రకుమార్, నాబార్డ్ డీడీఎం విజయ్ విహరీ, ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ లక్ష్మీ, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి



మినుము పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మీరాపురం, పాచికలపాడు గ్రామాలలో సాగులో ఉన్న శనగ, పెసర తదితర పంటలను పరిశీలించి మాట్లాడారు. శనగ పంటకు పొగాకు లద్దె పురుగు, రబ్బరు పురుగులు ఎక్కువగా ఆశించాయన్నారు. ఇవి శనగ పంటను కాండం నుంచి నాశనం చేస్తాయన్నారు. వాటి నివారణకు 1.5 మి.లీ. నోవాల్యూరాన్, ఇండాక్సాకార్బను లీటర్ నీటికి పిచికారి చేయాలన్నారు. లేని పక్షంలో 0.5 మి.లీ.టెట్రనిలిప్రోల్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. మినుము పంటకు అక్కడక్కడ ఎల్లోమొజాక్ ఆశించిందన్నారు. దీని నివారణకు 1మి.లీ. స్పైరో మేసిఫిన్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ దస్తగిరి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి

వేంపల్లె : ప్రజా సమస్యలపై సంబంధిత ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని సత్వరమే పరిష్కరించాలని జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రిలు ఆదేశించారు. శనివారం స్థానిక నూతన ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మండలస్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ తదితర నిత్యావసర వస్తువులు సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పట్టణ పరిధిలోని పలు సమస్యలను ఎంపీటీసీలు వారి దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్పందిస్తూ ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి ఏదైనా సమస్య తీసుకొస్తే వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.దివిజ, ఎంపీటీసీలు కటిక చంద్రశేఖర్, మణి గోపాల్‌రెడ్డి, హబీబుల్లా, రాజ్‌కుమార్, భారతి, రహమతుల్లా ఖాన్, బ్రహ్మయ్య, శివశంకర్‌రెడ్డి, కో ఆప్షన్ అస్సానయ్య, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడండి

కొండాపురం : గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు ఎంపీపీ లక్ష్మీదేవి అదేశించారు. శనివారం మండల పరిషత్ సభాభవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ అజెండాలోని అంశాల వారిగా అన్ని శాఖల అధికారులు వారి పురోగతిని వివరించాలన్నారు. చామలూరు పునరావాస కేంద్రంలో చేసిన పనులకు సంబంధించి ఉపాధి హామీ పథకంలో చేయాల్సిన బిల్లులు పెట్టలేదని చామలూరు గ్రామ సర్పంచ్ రాఘవేంద్రరెడ్డి తెలిపారు. కొండాపురంలో జెడ్పీ ఉన్నతపాఠశాల నూతన భవనం నిర్మించేందుకు నాడు-నేడు పథకంలో మంజూరు చేయడంలేదని స్థానిక ప్రజాప్రతినిధులు తెలిపారు. ఏ సమావేశాలకు మండల విద్యుత్ శాఖ అధికారి రాకుండా ఉన్నాడని గ్రామాల్లో విద్యుత్ సమస్యలపై చర్చించాల్సి ఉందని అధికారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భారతి, వైస్ ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి, డీటీ రాజేశ్వరి, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు

అంగన్‌వాడీ కేంద్రానికి వితరణ



అంగన్‌వాడీ కేంద్రానికి సామగ్రిని అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చెన్నూరు : స్థానిక 16వ వార్డు సరస్వతి నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి శనివారం సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి జన్మదినం సందర్భంగా బీరువా, గ్యాస్ స్టవ్, వంట పాత్రలను వితరణగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పెడబల్లె ప్రదీప్‌కుమార్‌రెడ్డి, నిత్యపూజయ్యలు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులతో బర్త్ డే కేక్‌ను కట్ చేసి అందరికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ మాట్లాడుతూ నరేన్ రామాంజులరెడ్డి జన్మదినం సందర్భంగా అనేక సేవా కార్యక్రమాలను చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్నమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రముఖులకు ఘన నివాళి

పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దనూరు రో డ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో ఆర్‌సీడీఎస్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ నిర్మాత, దర్శకుడు బొమ్మిరెడ్డి నాగిరెడ్డి జయంతి, మాజీ సీఎం మర్రి చె న్నారెడ్డిల వర్ధంతిలను పురస్కరించుకుని వారి చిత్ర పటాలకు ఆర్‌సీడీఎస్ సంఘ నాయకులు సురేంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, రెడ్డి, యూత్ కన్వీనర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డిలు ఘనంగా నివాళులర్పించారు.